# విద్యుత్ మీటర్ రీడర్ల ఉపాధికి గండం

- స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్న సందర్భంలో ఆందోళన
- రెగ్యులైజ్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వేడుకోలు


విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తున్న మీటర్ రీడర్ శ్రీధర్


విద్యుత్ శాఖ డీఈ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : వారంతా చాలీ చాలని వేతనాలతో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు. ఎన్ని ఏళ్ల గడిచినా తాము ఔట్ సోర్సింగ్ సిబ్బందిగానే పని చేయాల్సి వస్తోంది. ఎప్పుడు ఉద్యోగం ఉంటుందో ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రెండు దశాబ్దాలుగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న వారు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రెగ్యులైజ్ చేయాలని వేడుకుంటున్నారు. మరో పక్క విద్యుత్ స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్న సందర్భంలో ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని విద్యుత్ మీటర్‌రీడర్స్ ఆందోళన చెందుతున్నారు. కొత్తగా ఏర్పడే సర్కిల్ల మీటర్‌రీడర్స్‌కు క్వాలిఫికేషన్ బట్టి, అర్హతలను బట్టి షిఫ్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, వాచ్‌మెన్‌లు, డ్రైవర్స్, గ్యాంగ్ మెన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు ఏపీ మీటర్ రీడింగ్ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు ఒ.శ్రీనివాసరావు, కోశాధికారి కె.మల్లేశ్వర రావుల ఆధ్వర్యంలో ఇటీవల ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు ట్రాన్స్‌కో డీఈ టెక్నికల్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు.

**ఏలూరు నగరం పరిధిలో 30 మంది**

ఏలూరు కార్పొరేషన్ పరిధిలో సుమారు 30 మంది వరకు విద్యుత్ మీటర్ రీడర్స్ పనిచేస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో వీరు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 11వ తేదీ మధ్య విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తుంటారు. ఒక్కో మీటర్ రీడింగ్ తీసినందుకు విద్యుత్ శాఖ సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.6 నుంచి రూ.7 వరకు చెల్లిస్తుంది. మెషీన్ చార్జీలు, ఫోన్ రీచార్జి, రోల్స్, మరమ్మతులు, ఈఎస్ఐ, ఈపీఎఫ్ కటింగ్‌లు పోను విద్యుత్ మీటర్ రీడర్ చేతికి వచ్చేది కేవలం రూ.3.10 మాత్రమే. సగటున ఒక్కో మీటర్ రీడర్ నెలకు 3 వేల మీటర్లను మాత్రమే రీడింగ్ తీసే అవకాశం ఉంది. దీంతో వీరికి నెలకు రూ.10 వేలలోపే ఆదాయం సమకూరుతుంది.

### ఉద్యోగ భద్రత కల్పించాలి



ఏలూరు జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలి. రెండు దశాబ్దాలకు పైబడి పనిచేసేవారు అనేక మంది ఉన్నారు. వీరంతా మీటర్‌కు కొంత రేటు చొప్పున వేతనం పొందుతున్నారు. ఇంత కాలంగా పనిచేస్తున్నా నేటికీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగానే పనిచేస్తున్నారు. చాలీచాలని ఆదాయంతోనే కుటుంబాలను గడుపుకోవాల్సిన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

– బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు, ఏలూరు

### రెగ్యులైజ్ చేయాలి



విద్యుత్ మీటర్ రీడర్స్‌ను టీడీపీ కూటమి ప్రభుత్వం రెగ్యులైజ్ చేయాలి. సుదీర్ఘ కాలం ఇదే పనిలో ఉన్న వారికి సీనియారిటీని బట్టి, వారి అర్హతలను బట్టి విద్యుత్ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న వీరికి ఇంత వరకు ఉద్యోగ రక్షణ కరువైంది. ఇలాంటి చిరు ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

– డీఎస్‌వీడీ ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఏలూరు

### రూ.15 వేలు కూడా రావడం లేదు



నెలకు కనీసం రూ.15 వేలు ఆదాయం కూడా రావడం లేదు. ఏరియాను బట్టి విద్యుత్ మీటర్ రీడర్‌కు నెలకు 2 వేల నుంచి 4 వేల మీటర్లను రీడింగ్ తీసే అవకాశం ఉంది. అడపాదడపా 5 వేల మీటర్ల రీడింగ్‌లు తీసే వారు కొందరు ఉంటున్నారు. అన్ని ఖర్చులూ పోను కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి మీటర్ రీడర్‌కు ఒక్కో మీటర్‌కు రూ.3.10 చెల్లిస్తున్నారు. దీంతో నెలకు రూ.15 వేలు ఆదాయం కూడా రావడం లేదు.

– కంది మురళీ బాబు, విద్యుత్ మీటర్ రీడర్, పోస్టల్ కాలనీ, ఏలూరు

### అర్హతను బట్టి ఉద్యోగం ఇవ్వాలి



ఎంతో కాలంగా విద్యుత్ మీటర్ రీడర్‌గా పనిచేస్తున్న మాకు విద్యార్హతను బట్టి రెగ్యులర్ ఉద్యోగం ఇవ్వాలి. షిఫ్ట్ ఆపరేటర్స్, అటెండర్స్, వాచ్‌మెన్‌లు, డ్రైవర్స్, గ్యాంగ్ మెన్లుగా ఉపాధి కల్పించి ఆదుకోవాలి. మాలోను విద్యార్హతలు ఎక్కువగా ఉన్నవారూ ఉన్నారు. చాలీచాలని రాబడితో కుటుంబాలు కడవడం చాలా ఇబ్బంది కరంగాఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం మా పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలి.

– ఎస్ శివరామ కృష్ణ, విద్యుత్ మీటర్ రీడర్, హనుమాన్ నగర్, ఏలూరు

## క్లుప్తంగా

### నూతన మద్యం పాలసీ సవరణ కోరుతూ వినతి


వినతి పత్రం అందిస్తున్న ఐద్వా నాయకులు

ఏలూరు (టూటౌన్): నూతన మద్యం పాలసీని సవరించాలని, నివాస ప్రాంతాల వద్ద మద్యం షాపులు పెట్టొద్దని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ ఇప్పటికే మద్యం వల్ల మహిళలు, చిన్న పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏలూరులోనే పనికోసం వచ్చిన ఒక మహిళపై భర్త ఉండగానే ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని, ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నా.. మళ్లీ నూతన మద్యం పాలసీ పెట్టి ప్రైవేట్ వారికి అప్పజెప్పడం వల్ల పేదల కుటుంబాలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ప్రభుత్వం ఆధీనంలోనే మద్యం షాపులను నడపాలని, షాపుల సమయం కుదించాలని డిమాండ్ చేశారు. జి.శారద, సీహెచ్ రాజ్యలక్ష్మి, ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

### ఏలూరు రూరల్ ఎంపీడీఓగా శ్రీలత

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండల ఎంపీడీఓగా ఎ.శ్రీలత నియమితులయ్యారు. ఈ నెల 7వ తేదీన ఆమె విధుల్లో చేరనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన బి.ప్రణవి విజయవాడకు బదిలీ కావడంతో గురువారం రిలీవయ్యారు. మండలంలో ఐదేళ్ల పాటు పనిచేసిన పలువురు అధికారులకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీ స్థానంలో ఎం సరళకుమారి ఉంగుటూరు నియోజకవర్గానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో వేరొకరని నియమించాల్సి ఉంది. పీఆర్ఏఈ కృష్ణప్రసాద్ స్థానంలో బీవీ శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటు మొండికోడు, కోటేశ్వరదుర్గాపురం, కొక్కిరాయిలంక, కోమటిలంక, కాట్లంపూడి, కలకుర్రు పంచాయతీలకు సచివాలయ కార్యదర్శులకు ప్రమోషన్ ఇచ్చి, గ్రేడ్-5 కార్యదర్శులుగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటి వరకు ఈ పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులు బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

### పరిపాలనపై అవగాహన కల్పించాలి

ఏలూరు(మెట్రో): గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు పరిపాలనలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మ శ్రీ అన్నారు. ఏలూరులోని జిల్లా పంచాయతీ రాజ్ వనరుల శిక్షణ కేంద్రంలో ట్రైనిలకు (శిక్షకులు) ఏర్పాటుచేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలానే లక్ష్యంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసిందన్నారు.

# బాలాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ


12 పంపుల సెంటరులోని బాలత్రిపురసుందరీ దేవిగా..


శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారు


సౌభాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

### దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం


12 పంపుల సెంటరులోని కనకదుర్గమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆశ్వీయుజ శుద్ధ పాఢ్యమి పర్వదినం సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో గురువారం శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు క్షీరాభిషేకాలు, బాలభోగ వినియోగాలు, శ్రీచక్ర అర్చనలు, కుంకుమార్చనలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు, విశేష పూజలు నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. తీర్థ ప్రసాద వినియోగం చేశారు. తొలి రోజు ఉత్సవాల్లో భాగంగా ఆయా ఆలయాల్లో అమ్మవార్లు శ్రీ బాలా త్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం, పవర్‌పేట వాసు ఆలయం ప్రాంగణంలోని రాజ్యలక్ష్మీదేవి దేవస్థానం, రామచంద్రరావు పేట శ్రీమత్ మార్కండేయ వేదపాఠశాల, పత్తేబాద కనకదుర్గ ఆలయం, 12 పంపుల సెంటర్ కనకదుర్గమ్మవారి ఆలయం, సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, దక్షిణపు వీధిలోని బాలాత్రిపుర సుందరి దేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నగరంలోని వివిధ ఆలయాల్లో ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో ప్రారంభ దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

ప్రైవేటీకరణ చేయవద్దు అంటూ నిరసన



శాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయవద్దు అంటూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షల్లో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అంటూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఏలూరులో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. స్థానిక వసంత మహల్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయవద్దు అంటూ రైతు, వ్యవసాయ, కార్మిక, కౌలు రైతు, చేతి వృత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనకారులు కదం తొక్కారు. విశాఖ ఉక్క పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహనరావు, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఎన్నో త్యాగాలు ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం కారు చౌకగా అమ్మేసే చర్యలు చేపట్టడం దుర్మాదర్గమని అన్నారు. దీనికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ఆంధ్రుల హక్కు అని అన్నారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని తెలిపారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. పోరాడితేనే విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించుకోగలమన్నారు. భూములిచ్చిన రైతుల బిడ్డలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మే ప్రయత్నాలు ఆపకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ దీక్షకు ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు, జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎస్‌వీడీ ప్రసాద్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో అమరులైన అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కట్టా భాస్కరరావు, బి.సోమయ్య, జె.గోపి, గన్ను వెంకట్రావు, కె.వసంతరావు, గొలిమే బాల యేసు, కొమ్మన సాంబశివరావు, ఎస్‌వీ సుబ్బారావు, పుప్పాల కన్నబాబు, యు.హేమ శంకర్, కడుపు కన్నయ్య, పిచ్చుక ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

# మైక్రో ఆర్ట్స్ ద్వారా ఉపాధి అవకాశాలు


మైక్రో ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : మైక్రో ఆర్ట్స్ ద్వారా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, బియ్యం గింజలపై అక్షరాలు రాయడం ద్వారా జాతీయ స్థాయి ప్రచారంతో తాను ఉపాధి పొందుతున్నానని మైక్రో ఆర్టిస్ట్ దోర శివ ప్రసాద్ అన్నారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో మైక్రో ఆర్ట్స్ దసరా మూడురోజుల శిక్షణ శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఓఎంజీ అవార్డ్ విన్నర్ దోర శివ శంకర్ మాట్లాడుతూ తాను పేదరికంతో 10వ తరగతితో చదువు ఆపేసినా బియ్యం గింజలపై అక్షరాలు రాయడం చేస్తూ ఒకే బియ్యం గింజపై 116 అక్షరాలు రాసి గుర్తింపు పొందానని, విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక ప్రత్యేక అంశంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లితండ్రులు కూడా ఈ నైపుణ్యం పెంచుకోవచ్చన్నారు. ఈ శిక్షణ ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం అవుతుందని, మూడు రోజులలో బియ్యం గింజలపై అక్షరాలు రాయడం దోర శివ ప్రసాద్, అగ్గిపుల్లలపై బొమ్మలు గీయడం మేతర సురేష్ బాబు నేర్పిస్తారని చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటలకు ఏఆర్‌డీజీకే హైస్కూల్‌లో కరస్రాము శిక్షణ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రభుత్వ బాలికల హైస్కూల్ టీచర్ సుధాకర్ మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం దసరా శిక్షణ శిబిరం తమ స్కూల్‌లో ఏర్పాటు చేయడం, నగరంలోని 100 మంది నేర్చుకోవడం సంతోషం కలిగిస్తోందని చెప్పారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఏలూరు టౌన్ : బుట్టాయగూడెం ప్రాంతానికి చెందిన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడానికి చెందిన బి.గాంధీ (46) కడుపునొప్పితో బాధపడుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన అతను గత నెల 30న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ద్వారకాతిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### విద్యుత్ చార్జీలు పెంచబోమన్న హామీని నిలబెట్టుకోవాలి

ఏలూరు (టూటౌన్): విద్యుత్ చార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ ఇతర భారాలు తగ్గిస్తామని, చార్జీలు పెంచబోమని ఇచ్చిన హామీకి భిన్నంగా విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీలు 2022-23 సంవత్సరానికి సుమారు రూ.8,114 కోట్లు భారం వేస్తూ మూడు విద్యుత్ పంపిణీ సంస్థల ప్రతిపాదనలతో విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సీ) నోటిఫికేషన్ జారీ చేసిందని ఆరోపించారు. 2023-24కు సంబంధించి మరో రూ.11 వేల కోట్లు పైగా సర్దుబాటు చార్జీల భారం మోపబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు రూ.20 వేల కోట్లు భారం విద్యుత్ వినియోగదారులుపై భారం పడబోతుందని తెలిపారు. ప్రైవేటు విద్యుత్ కొనుగోలు, వివిధ స్థాయిల్లో అవినీతి, అపసవ్య విధానాల వల్ల విద్యుత్ వ్యయం పెరుగుతోందని విమర్శించారు. ఆ భారాన్ని సర్దుబాటు చార్జీల రూపంలో జనం నెత్తిన వేయటం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజలపై ఇలాంటి అదనపు భారాలు మోపటం సరికాదన్నారు. తక్షణమే నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలని ఎ.రవి డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 25 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 28 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 18 |
| ఏలూరు - తిరుపతి(ఇంద్ర) | 19.00 | 27 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 25 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 24 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 28 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 14 |
| ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం | 20.15 | 4802 | 25 |
| ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 29 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 29 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 20 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 33 |

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 74 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 34 | చిక్కుడు కాయలు | 68-100 |
| వంకాయలు (కాంతులు) | 48 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | 44 | ములక్కాడలు | 07,10 |
| బెండకాయలు | 34 | కంద | 60 |
| పచ్చిమిర్చి | 28 | బీట్‌రూట్ | 46 |
| కాకర కాయలు | 34-44 | కీరా దోస | 40 |
| బీరకాయలు | 44 | ఫ్రెంచ్‌బీన్స్ | 120 |
| బీరకాయలు (పందిరి) | 54 | అల్లం | 70-150 |
| క్యాబేజీ | 28 | కొత్తిమీర (కట్ట) | 25 |
| క్యారెట్ | 54-50 | పాలకూర | 15 |
| దొండకాయలు | 48 | చుక్కకూర | 15 |
| బంగాళదుంపలు | 40 | తోటకూర | 12 |
| ఉల్లిపాయలు | 40-56 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 44 | పుదీనా | 05 |
| దోసకాయలు | 30 | బఠాణి | -- |
| ఆనబకాయ (1) | 30 | క్యాప్సికమ్ | 70 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకదదుంప | 48 |

# 5, 6 తేదీల్లో ఆర్టీసీ సీజన్ పాస్‌ల జారీ రద్దు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఏలూరు డిపో పరిధిలో సీజన్ పాసులు, విద్యార్థుల బస్సు పాసుల జారీని ఈ నెల 5, 6 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు ఆర్టీసీ ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కారణంగా పాసుల జారీని నిలుపుదల చేస్తామని, ఈ నెల 7వ తేదీ నుంచి యథావిధిగా పాసులు జారీ చేస్తామని తెలిపారు.

# రైల్వే లోయర్ బ్రిడ్జిలో నీరు రాకుండా చర్యలు చేపట్టాలి


పార్టీ మహాసభలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు రైల్వే లోయర్ బ్రిడ్జిలో వాటర్ రాకుండా శాశ్వత చర్యలు చేపటాలని సీపీఎం మధ్యతరగతి శాఖ మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక పవరుపేటలోని సీపీఎం కార్యాలయంలో మధ్యతరగతి శాఖ మహాసభ కె.రామాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తిరుపతి లడ్డూ చుట్టూ రాజకీయాలు నడుపుతుందని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్లన్నీ పాడైపోయాయని తక్షణం వాటిని నిర్మించాలని కోరారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర సరుకుల ధరలను అరికట్టాలని కోరారు. అనేక ప్రజా సమస్యలు ఉండగా పరిష్కరించడం మానివేసి లడ్డూ రాజకీయాలు నడపడం సిగ్గు చేటన్నారు. ఇది రాష్ట్రంలో ప్రజల మధ్య మత వైషమ్యాలు సృష్టించడానికి దోహదపడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సభలో నగరంలోని పలు సమస్యలుపై తీర్మానాలు చేశారు. లోయర్‌రైల్వే బ్రిడ్జిలోకి నీరు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని, నగరంలో పాడైపోయిన రోడ్లన్నీ నిర్మించాలి, రాత్రి సమయాల్లో నేషనల్ హైవే మీదుగా వెళ్లే బస్సులను ఏలూరు నగరంలోపల నుంచి వెళ్లే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. వివిధ రంగాల సభ్యులు కట్టా సత్యనారాయణ, వీజీఎంఆర్ కృష్ణారావు, బి.శ్రీనివాస్, పి.రవికుమార్, జి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


చంద్రబోసు (ఫైల్)

ఉంగుటూరు: మండలంలోని చేబ్రోలు గ్రామంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై గురువారం గ్రామానికి చెందిన తుమ్మపాల సుభాష్‌చంద్రబోసు(40)మరణించాడు. ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని పాత కోట్లమ్మ ఆలయ శుభ్రం చేసే క్రమంలో అక్కడున్న మోటారు వేసేటప్పుడు చంద్రబోస్ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య లలిత, ఇద్దరు అబ్బాయిలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మణికుమార్ తెలిపారు.